సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 6 । జూన్ । 2023



తొలి తెలుగు శాసనాన్ని కలమల్లలోనే భద్రపరచాలి

ఎర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామంలోని తొలి తెలుగు శాసనాన్ని అక్కడే భద్రపర చాలని గ్రామస్తులు కోరారు. - 8లో



లోకేష్ పాదయాత్రతో ఒరిగిందేమీ లేదు

నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. - 8లో



రాకపోకలకు ఇసుక టిప్పర్ బ్రేక్!

రాయచోటి–రాజంపేట ఘాట్‌రోడ్ మలుపులో టిప్పర్ ఆగిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. - 8లో

న్యూస్‌రీల్

జిల్లాలో ఆదాయం పెంపునకు కృషి



రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పీవీఎన్ బాబు

కడప కోటిరెడ్డిసర్కిల్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో జిల్లాలో ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తానని నూతన రిజిస్ట్రార్ పి.వెంకట నారాయణబాబు తెలిపారు. సోమవారం సాయంత్రం కడపలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో భూములు, స్థలాల క్రయ విక్రయాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూస్తానన్నారు. శాఖాపరంగా ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అనంతరం జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్లు శ్యామలాదేవి, చంద్రమౌళి, మారుతి ప్రసాద్, అజీజ్, మహబూబ్‌బాషా, ఎస్ఎండీ రఫీ, నాజిర్, రాజశేఖర్, సుబ్బారెడ్డి, డీఆర్ సీసీ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం హర్షణీయం

కడప రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం అభినందనీయమని ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆదాల వెంగళరెడ్డి, మేసా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల చిరకాల కోరిక అయిన రెగ్యులర్ అంశం సోమవారం అమరావతిలో కమిటీ సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా 2014 జూన్ 2వ తేదీ నాటికి పదేళ్ల సర్వీసు ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కమిటీ సూచించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల సర్వీసు ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అధికారులను ఆదేశించడం ప్రశంసనీయమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య పరీక్షలకు అభ్యర్థులు



అభ్యర్థులకు వైద్య పరీక్షల సిఫార్సు లేఖలను అందజేస్తున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా నిలబడి కారుణ్య నియామకాలు చేపట్టింది. అందులో భాగంగా కడప రీజియన్ పరిధిలో 14 మందికి అసిస్టెంట్ మెకానిక్ పోస్టులకుగాను వైద్య పరీక్షలు నిర్వహించే నిమిత్తం సోమవారం ఆర్ఎం గోపాల్‌రెడ్డి అభ్యర్థులకు సిఫార్సు లేఖలను అందజేశారు. మంగళవారం కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఏరియా ఆస్పత్రిలో వీరికి వైద్య పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ పరీక్షల్లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందిన అభ్యర్థులకు జిల్లాలోని వివిధ డిపోలకు కేటాయిస్తూ నియామక ఉత్తర్వులను అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో పీఓ రవి, సూపరింటెండెంట్ అల్లాబకష్ పాల్గొన్నారు.

వేమన వెలుగులు..!



యోగివేమన విశ్వవిద్యాలయం

- టాప్–200 విశ్వవిద్యాలయాల్లో వైవీయూకు చోటు
- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో 151–200 శ్రేణి
- మరింత మెరుగైన ర్యాంకింగ్ కోసం యత్నిస్తామంటున్న అధికారులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఖ్యాతి మరోసారి జాతీయ స్థాయిలో రెపరెపలాడింది. భారత విద్యామంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సోమవారం విడుదల చేసిన విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లో టాప్–200లో వైవీయూ చోటు దక్కించుకుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)–2023 వారు ప్రకటించిన ర్యాంకింగ్‌లో యోగివేమన విశ్వవిద్యాలయం 151 నుంచి 200 శ్రేణి ర్యాంకింగ్‌లో చోటు దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని నూతన విశ్వవిద్యాలయాల్లో వైవీయూకు మాత్రమే ఈ ర్యాంకింగ్‌లో చోటు దక్కడం విశేషం. విశ్వవిద్యాలయాలకు ర్యాంకింగ్ ఇచ్చేందుకు 5 అంశాలను ప్రామాణికంగా తీసుకుని ర్యాంకును కేటాయిస్తారు. 1. బోధన, అభ్యసన వనరులు, 2. పరిశోధన, వృత్తిపరమైన సాధన, 3. గ్రాడ్యుయేషన్ అవుట్ కమ్, 4. సమ్మిళిత ప్రగతి ఫలితాలు 5. జ్ఞానం, అవగాహన (పర్సెప్షన్) అంశాల ఆధారంగా ర్యాంకింగ్ కేటాయిస్తారు. తాజాగా విడుదలైన ర్యాంకింగ్‌లో 1–100 ర్యాంకుల్లో మన రాష్ట్రం నుంచి ఆంధ్ర, ఎస్వీయూలు మాత్రమే చోటు దక్కించుకున్నాయి. 151–200 శ్రేణి స్థానాల్లో తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, యోగివేమన విశ్వవిద్యాలయాలు మాత్రమే సంప్రదాయ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్ జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

పోటీలో తట్టుకుని.. చోటు దక్కించుకుని..

ఎన్ఐఆర్ఎఫ్‌కు దేశవ్యాప్తంగా 2022–23 విద్యాసంవత్సరానికి గాను 8686 విద్యాలయాలు దరఖాస్తు చేసుకోగా.. ఎన్ఐఆర్ఎఫ్ ప్రమాణాలను అనుసరించి ర్యాంకింగ్ ప్రకటించారు. ఏపీ నుంచి సంప్రదాయ విశ్వవిద్యాలయాల్లో టాప్–200లో కేవలం 4 విశ్వవిద్యాలయాలు మాత్రమే ఉండగా అందులో వైవీయూ చోటు దక్కించుకోవడం గమనార్హం. కాగా 2017లో ప్రకటించిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో వైవీయూ టాప్–100లో చోటు దక్కించుకుని 92వ స్థానంలో నిలిచి ఏపీలో టాప్–3గా నిలిచి చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత యేడాది నుంచి ఎక్కువ సంఖ్యలో విద్యాలయాలు, విశ్వవిద్యాలయాల నుంచి పోటీ తీవ్రత పెరగడంతో వైవీయూ టాప్–200లోపే పరిమితమైంది. యోగివేమన విశ్వవిద్యాలయం తిరిగి టాప్–100లోపు ర్యాంకు సాధించాలంటే అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తగిన కార్యాచరణ చేపడితే కష్టమేమీ కాదని నిపుణులు పేర్కొంటున్నారు. బోధన, పరిశోధన, పరిశోధక వ్యాసాలు, మౌలిక సదుపాయాలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్లేస్‌మెంట్స్, ఉన్నత విద్యాభ్యాసం, విశ్వవిద్యాలయ పరీక్షల నిర్వహణ, పీహెచ్‌డీ విద్యార్థులు, రీసెర్చ్ ప్రాజెక్టులు, పబ్లికేషన్స్, సైటేషన్స్, పేటెంట్స్, మహిళల ప్రాధాన్యం తదితర అంశాలపై దృష్టి సారిస్తే మరింత మెరుగైన ర్యాంకింగ్ సాధ్యమేనని వైవీయూ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తాం..



యోగివేమన విశ్వవిద్యాలయానికి 150లోపు ర్యాంకింగ్ వస్తుందని భావించాం. 151 నుంచి 200లోపు ర్యాంకు రావడం సంతోషకరమే అయినప్పటికీ మరింత మెరుగైన ర్యాంకు సాధించేందుకు కృషిచేస్తాం. అధ్యాపకుల వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపు, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, ప్లేస్‌మెంట్స్, రీసెర్చ్, పబ్లికేషన్స్, సైటేషన్స్, పేటెంట్స్, ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్, వైవీయూ

మరింత మెరుగైన ర్యాంకింగ్ కోసం కృషి..



యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో జాతీయస్థాయిలో 151–200 శ్రేణిలో నిలవడం సంతోషంగా ఉంది. అయితే టాప్–100 విశ్వవిద్యాలయాల్లో వైవీయూను నిలిపేలా కృషిచేస్తాం. రానున్న రోజుల్లో మరింత మెరుగైన ర్యాంకింగ్ సాధిస్తాం.

– ఆచార్య చింతా సుధాకర్, వైస్ చాన్సలర్, వైవీయూ

అతిసార నిర్మూలనకు చర్యలు

కలెక్టర్ విజయరామరాజు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో అతిసార నిర్మూలనకు గట్టి చర్యలు చేపట్టామని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్ స్పందన హాలులో ఆయన ఆవిష్కరించారు. ఈనెల 5 నుంచి 17వ తేది వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పుట్టిన బిడ్డ మొదలు ఐదేళ్లలోపు పిల్లల్లో డయేరియాను, దానివల్ల సంభవించే మరణాలను పూర్తిగా అరికట్టడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్ కుమార్, వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను పరిశీలించి సత్వర పరిష్కారాన్ని అందించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులకు సూచించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపారు. అర్జీలను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్లు రాహుల్‌మీనా, మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు ఆనంద్‌నాయక్, యదుభూషణరెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తి

నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు కింద చేపట్టిన జగనన్న హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో గృహ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జేసీ గణేష్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్లు రాహుల్‌మీనా, మౌర్య భరద్వాజ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పచ్చటి పరిసరాలతోనే ఆహ్లాదకరమైన వాతావరణం



జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : పరిసరాలు పచ్చగా ఉంటేనే వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందని కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరులోని ఎర్రగుంట్ల రోడ్డులో ఉన్న రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో ఏర్పాటు చేసిన మిషన్ లైఫ్ ఎగ్జిబిషన్‌ను డీఎఫ్ఓ సందర్శించారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఏడు థీమ్స్‌కు సంబంధించిన స్టాల్స్‌ను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించరాదని చెప్పారు. నీరు, విద్యుత్‌లను పొదుపుగా వాడాలన్నారు. మానవాళి మనుగడకు చెట్లు జీవనాధారమన్నారు. పర్యావరణ దిశగా యువత అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి తమ పుట్టిన రోజున ఒక మొక్కను ఇంటి పరిసరాల్లో నాటాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను డీఎఫ్ఓ అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్‌డీఎఫ్ఓ ఎస్వీ దివాకర్, డీఆర్ఓ లక్షుమయ్య, అటవీ రేంజ్ సిబ్బంది, జన విజ్ఞాన వేదిక సభ్యులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జులై నాటికి హాకీ టర్ఫ్ కోర్టు నిర్మాణాలు పూర్తి చేయండి



హాకీ టర్ఫ్ కోర్టు నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న శాప్ ఎండీ హర్షవర్ధన్, తదితరులు

పులివెందుల టౌన్/రూరల్: పులివెందుల పట్టణంలోని ధ్యాన్‌చంద్ క్రీడా మైదానంలో నూతనంగా నిర్మిస్తున్న హాకీ టర్ఫ్ కోర్టు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని శాప్ ఎండీ హర్షవర్ధన్ పేర్కొన్నారు. సోమవారం పులివెందుల పట్టణంలోని పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జులై 8వ తేదీన పులివెందులలో పర్యటిస్తారని.. ఆయన ప్రారంభించే అభివృద్ధి పనులు హాకీ టర్ఫ్ కోర్టుతోపాటు కబడ్డీ కోర్టు, అథ్లెటిక్స్, ఆర్చి, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ధ్యాన్‌చంద్ క్రీడా మైదానంలో ఉన్న హాకీ అకాడమి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే హాకీ టర్ఫ్ కోర్టు, అథ్లెటిక్స్, కబడ్డీ కోర్టుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో స్టెప్ సీఈఓ సాయి గ్రేస్, ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, డీఈ జగదీశ్వరరెడ్డి, చీఫ్ కోచ్ అమృత్‌రాజ్, స్పోర్ట్స్ స్పెషలాఫీసర్ మొహిద్దీన్, హాకీ కోచ్ కళ్యాణ్, ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే జగనన్న లక్ష్యం



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలన సాగిస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల రాష్ట్ర ప్రజలు పూర్తిగా సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. సంక్షేమ ఫలాలు లబ్ధిదారుల గడప వద్దకే అందేలా పాలన సాగుతోందన్నారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వ పథకాలు పార్టీలకతీతంగా ప్రజలకు అందుతున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు మరలా ప్రజలను మోసం చేసేందుకు అబద్ధపు హామీలతో ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ తాము అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ప్రజల గురించి ఆలోచించిన పాపాన పోలేదన్నారు. ఆ పార్టీకి కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా నిరంతరం రాష్ట్ర ప్రజల శ్రేయస్సు గురించి ఆలోచించేది తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. అనంతరం ఆయన ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డితో కలిసి ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

ఇక హాస్టల్ వంట.. వహ్వా..!

- వంట చేయడంలో మెలకువలు
- విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించేందుకు చర్యలు
- జిల్లాలో మొత్తం 189 ప్రభుత్వ హాస్టళ్లకు చెందిన 320 మందికి ప్రత్యేక శిక్షణ
- ఇలాంటి శిక్షణ జిల్లాలోనే ప్రథమం

కడప రూరల్: జిల్లాలోని వివిధ వర్గాలకు చెందిన ప్రభుత్వ సంక్షేమ శాఖల హాస్టళ్లలోని విద్యార్థులకు ఇకపై రుచికరమైన అదిరిపోయే వంటలు తినే భాగ్యం కలగనుంది. అందుకోసం వంట మనుషులు ప్రత్యేకంగా శిక్షణ పొందుతున్నారు. విద్యార్థులకు రుచికరమైన వంటలను వడ్డించడానికి సిద్ధమవుతున్నారు.

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ కారణంగా..

జిల్లా కలెక్టర్ విజయరామరాజు చొరవ, నిధులతో ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు కడపలోని రాజంపేట రోడ్డులో గల జిల్లా మహిళా సమాఖ్య భవనంలో జరుగుతున్నాయి. ఈ నెల 1వ తేదీ నుంచి 12వ తేదీ వరకు రెండు బ్యాచ్‌లు మహిళలు, మరో రెండు బ్యాచ్‌లు పురుషులు మొత్తం నాలుగు బ్యాచుల్లో జిల్లాలోని మొత్తం 189 హాస్టళ్లలో పనిచేస్తున్న మొత్తం 320 మంది (ఇందులో కొంతమంది అన్నమయ్య జిల్లా కేజీబీ పాఠశాలలకు చెందిన వంట మనుషులు ఉన్నారు) వంట మనుషులకు జిల్లా సంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పర్యవేక్షణలో ఆర్తి హోం సౌజన్యంతో నిపుణులైన చెఫ్ శ్రీధర్, అసిస్టెంట్ సూర్య, కో ఆర్డినేటర్ కబీర్ అహ్మద్ సారథ్యంలో ఒక బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ప్రోగ్రాం ఇన్‌చార్జులుగా సోషల్ వెల్ఫేర్‌కు చెందిన కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు ఏఎస్‌డబ్ల్యూఓలు శ్రీలక్ష్మీనారాయణ, బి.గురుప్రసాద్, కె.డేవిడ్‌లు వ్యవహరిస్తున్నారు.

విద్యార్థుల ఆరోగ్యమే ధ్యేయంగా..

విద్యార్థి ఆరోగ్యంగా ఉంటేనే చురుగ్గా ఉండగలడు. అలాంటి వారు విద్యపై దృష్టి సారించగలరు..రాణించగలరు. అలా ఉండాలంటే మంచి రుచికరమైన పౌష్టికాహారం ఉండాలి. అందుకోసమే ఈ శిక్షణ ఏర్పాటు చేశారు. శిక్షణలో భాగంగా వంట మనుషులకు ఏ వంట ఎలా చేయాలి.. కాయగూరలు, ఆకు కూరలను ఎలా వాడాలి.. నూనె మసాలాలు ఏ మోతాదులో వేయాలి.. మజ్జిగ, సలాడ్‌లు ఏ విధంగా తయారు చేయాలి.. ఏ వంట ఎంత వేడిలో చేయాలి.. చికెన్, గుడ్డును ఎలా ఉడికించాలి.. ఇలా హాస్టల్‌లో వండే ప్రతి వంటకంపైనా మెలకువలతో కూడిన శిక్షణ ఇస్తున్నారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, గ్యాస్ వాడకం, వంట పాత్రల వినియోగం, వాటి శుభ్రత ఇలా ప్రతి అంశంపైనా దృష్టి సారించారు.



ఈ చిత్రంలో వంటలు చేయడంలో శిక్షణ పొందుతున్న వారు ఏ ఫైవ్ స్టార్ హోటల్లో లేదా ప్రైవేట్ హోటళ్లకు చెందిన వారో కాదు. జిల్లాలోని వివిధ వర్గాలకు చెందిన, ప్రభుత్వ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న హాస్టళ్లలో విద్యార్థులకు వంటలు వండి వడ్డించే వంట మనుషులు. జిల్లా కలెక్టర్ విజయరామరాజు చొరవతో విద్యార్థులకు శుభ్రతతో కూడిన రుచికరమైన మంచి పౌష్టికాహారం అందించడానికి చర్యలు చేపట్టారు. ఇలాంటి శిక్షణ రాష్ట్రంలో కేవలం వైఎస్సార్ జిల్లాలోనే నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఆ రోజు నుంచే హాస్టల్ విద్యార్థులు ఘుమ.. ఘుమలాడే వంటలను రుచి చూడనున్నారు.

గతమంతా అస్తవ్యస్తం..

గత పాలకుల హయాంలో ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలు ఏళ్ల తరబడి తిష్ట వేశాయి. ఇక అక్కడ అమలు చేసే మెను, వాటి నాణ్యత, విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలు నాసిరకంగా ఉండేవి. దీంతో విద్యార్థులు అన్నం తినాలంటేనే ముఖం చాటేసేవారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక హాస్టళ్ల స్వరూపమే మారింది. ఇప్పుడు అక్కడ విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందుతోంది. తాజాగా వైఎస్సార్ జిల్లాలో వంట మనుషులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

హాస్టళ్లలో వంట మనుషులకు ఇచ్చే శిక్షణ వివరాలు

శాఖ	హాస్టళ్లు	వంట మనుషులు
సోషల్ వెల్ఫేర్	68	68
ఎస్టీ	19	19
బీసీ	58	58
మైనార్టీ	15	15
కేజీబీ మరియు బీఆర్ అంబేడ్కర్ పాఠశాలలు	29	160
మొత్తం	189	320

శిక్షణ ఉపయోగకరంగా ఉంది



15 ఏళ్ల నుంచి వంట మనిషిగా పనిచేస్తున్నాను. ఇప్పుడు తీసుకున్న శిక్షణతో వంటల్లో ఎన్నో మెలకువలను తెలుసుకున్నాను. విద్యార్థులకు మరింతగా మెరుగైన, రుచికరమైన వంటలను వండి వడ్డిస్తాను.

– సంపూర్ణ, వంట మనిషి, ఎస్సీ బాలికల హాస్టల్, బద్వేల్

మంచి వంటలు వండేస్తాను



12 ఏళ్ల నుంచి వంట మనిషిగా పనిచేస్తున్నాను. వంటలపై తీసుకున్న శిక్షణ ద్వారా విద్యార్థులకు ఆరోగ్యకరమైన వంటలను వండుతాను. పిల్లలకు రుచి, శుచికరమైన ఆహారం అందిస్తేనే వారు ఆరోగ్యంగా ఉంటారు. – పి.రాధమ్మ, కేజీబీ పాఠశాల, పెండ్లిమర్రి

విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై దృష్టి



జిల్లా కలెక్టర్ విజయరామరాజు హాస్టల్ విద్యార్థుల సంక్షేమానికి విద్య, ఆరోగ్య సంరక్షణకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ హాస్టళ్లలో పని చేసే వంట మనుషులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. – సరస్వతి, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ

ప్రతి విద్యార్థికి విద్యా కానుక అందాలి



విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి

ఒంటిమిట్ట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న జగనన్న విద్యాకానుక ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థికి తప్పక అందించాలని ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం ఒంటిమిట్టలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిల్వ చేసిన విద్యా కానుక కిట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇచ్చే పాఠశాల యూనిఫామ్ నాణ్యత గురించి స్థానిక ఎంఈఓను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటసుబ్బయ్య, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: మదనపల్లె వన్, టు డిపోల పరిధిలో వేసవి సెలవులు ముగింపు పురస్కరించుకుని ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 9న మదనపల్లెలో బయలుదేరి బెంగళూరు, మైసూర్, హైకారా షూటింగ్ స్పాట్, ముదిమలై టైగర్ రిజర్వు, బండిపూర్ ఫారెస్టు, మైసూర్ ప్యాలెస్, జువాలజికల్ పార్కు, బృందావన్ గార్డెన్స్‌ను సందర్శిస్తారన్నారు. 10న వన్ డిపో నుంచి ఊటీకి సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు వారు తెలిపారు.

క్లుప్తంగా

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కమలాపురం రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫాం దిగువ లూప్‌లైన్‌పై సోమవారం ఉదయం గుర్తు తెలియని మగ వ్యక్తి మృతి చెందినట్లు కడప రైల్వే ఎస్‌ఐ రారాజు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహాన్ని కడప రిమ్స్ మార్చురీలో భద్రపరిచారు. ఇతని సంబంధీకులు కడప రైల్వే ఎస్‌ఐని సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

లోకేష్ పాదయాత్రతో ఒరిగిందేమీ లేదు..

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కమలాపురం : యువగళం పేరిట నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అది పాదయాత్ర కాదని, ఈవినింగ్ వాక్ అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర ఎందుకు చేస్తున్నాడని ప్రశ్నించారు. చీకట్లో తిరిగితే ఏ సమస్యలు తెలుస్తాయన్నారు. ఆయన కూడా వాళ్ల నాన్న లాగా ఈవినింగ్ వాక్ చేస్తున్నాడని చమత్కరించారు. మహానేత వైఎస్సార్, ఆయన తనయుడు జగనన్న మండుటెండలో పాదయాత్ర చేస్తే, లోకేష్, ఆయన తండ్రి చంద్రబాబు ఈవినింగ్ వాక్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఏమీ చేశారో లోకేష్ అదే కాపీ కొడుతున్నాడన్నారు. కాపీ వ్యాపారం ఎక్కువ రోజులు సాగదన్నారు. మళ్లీ మోసం చేద్దామని, వ్యవస్థలను మేనేజ్ చేద్దామని బాబు, లోకేష్ అనుకుంటున్నారని, ఇది ప్రస్తుత తరుణంలో సాధ్యం కాదని స్పష్టం చేశారు.ముస్లిం కంట్రీస్‌లో మోసం చేసే వారికి నడిబొడ్డున, ప్రజల మధ్య మరణదండన విధిస్తారన్నారు. అలా అయితే నిత్యం మోసం చేసే చంద్రబాబు, లోకేష్‌లకు ఎన్నిసార్లు ఉరి వేయాలో అని అన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ కాకపోయినా లోకేష్‌కు తన తండ్రి మంత్రి పదవి ఇచ్చాడని, అయినా తన పనితీరు మెరుగు పరుచుకున్నాడా? అని ప్రశ్నించారు. కేటీఆర్ కూడా అమెరికా నుంచే వచ్చాడని, తను పనితీరు ఎలా మెరుగు పరచుకున్నాడో ప్రజలందరికీ తెలుసన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నాయకుల మధ్య మనస్పర్థలు వచ్చి టీడీపీ నాయకులకు అన్నో ఇన్నో ఓట్లు వస్తాయే తప్ప సొంతంగా ఒక్క ఓటు కూడా రాదన్నారు. ప్రజలు విజ్ఞులని, వారు చెప్పే కల్లబొల్లి మాటలు, విని మోసపోరని, మంచి తీర్పు ఇస్తారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా 175 సీట్లలో గెలుపొందడం ఖాయం అని ఆయన స్పష్టం చేశారు.సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎన్సీ పుల్లారెడ్డి, మహ్మద్‌సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, కొండారెడ్డి, మస్తానయ్య, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఓ నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఓ రాష్ట్ర నాయకుడు

ప్రొద్దుటూరు : రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆవిర్భావం సందర్భంగా స్థానిక మాస్టర్స్ జూనియర్ కాలేజీలో సోమవారం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆర్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడుగా టి.జగన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.నాగార్జున, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వినోద్, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నాగార్జున, రాష్ట్ర కోశాధికారిగా హరిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకన్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో నూతన జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా స్వామ్యబద్ధంగా విద్యార్థి ఉద్యమాలు చేస్తామని తెలిపారు. రాయలసీమ సమస్యలపై పోరాడుతామన్నారు. సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను నిర్మించి రాయలసీమ వాసుల కోరికను నెరవేర్చాలని తెలిపారు. శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమలో రాజధాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం నుంచి రాయలసీమకు నీరు రావాలంటే జీఓ 69ని రద్దు చేయాలన్నారు. కృష్ణా రివర్ బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని, అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు కేటాయించాలని తెలిపారు. రాయలసీమ హక్కుల కోసం ఉద్యమం చేస్తామని చెప్పారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనాలను చోరీ చేసిన పటాన్ జోయెబ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ నారాయణయాదవ్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. కాల్వకట్టవీధికి చెందిన దేవిరెడ్డి నరేంద్రారెడ్డి, పేట ఉపేంద్రలు ఈ నెల 1న వైఎంఆర్ కాలనీలోని ఒక ఫొటో స్టూడియో వద్ద తమ బైక్‌లను పార్కింగ్ చేశారు. కొద్ది సేపటి తర్వాత చూసుకోగా అక్కడ బైక్‌లు కనిపించలేదు. దీంతో వారు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో నిందితుడు కాన్పుల ఆస్పత్రి సమీపంలో ఉండగా సీఐ నారాయణయాదవ్, ఎస్‌ఐ కృష్ణంరాజునాయక్‌లు సిబ్బందితో కలిసి వెళ్లి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపించినట్లు పోలీసులు తెలిపారు.



నిందితుడు, స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ నారాయణయాదవ్

రోడ్లకు తూట్లు పొడవడంపై ఫిర్యాదు

మైదుకూరు : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పాదయాత్ర సందర్భంగా ఆ పార్టీ వారు మైదుకూరులోని ప్రధాన రహదారులపై రంధ్రాలు వేయడంపై నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మైదుకూరులో శనివారం జరిగిన లోకేష్ పాదయాత్ర సందర్భంగా స్థానిక ప్రొద్దుటూరు, బద్వేలు రోడ్డుపై (హైవే), నంద్యాల, కడప రోడ్లపై (ఆర్‌అండ్‌బీ) రంధ్రాలు వేసి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీనిపై నేషనల్ హైవే ఏఈఈ నారాయణ నాయక్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ బి.రజియా వేర్వేరుగా మైదుకూరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రోడ్లపై రంధ్రాలు వేసి నష్టం కలిగించడమే కాక వాహనాల రాకపోకలకు అసౌకర్యం కలిగించినందుకు టీడీపీ మైదుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్, ఆపార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేయనున్నట్లు అర్బన్ సీఐ బీవీ చలపతి తెలిపారు.

స్విమ్మింగ్ పోటీలకు జట్టు ఎంపిక



క్రీడాకారులతో ప్రత్యేకాధికారి బాషామోహిద్దీన్, స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి రాజశేఖర్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో సోమవారం జిల్లాస్థాయి స్విమ్మింగ్ సీనియర్ విభాగం ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఎంపికల్లో చక్కటి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ప్రకటించారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ శిక్షకుడు రాజేంద్ర, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ బాలురు : ధనుంజయరెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి, నరేంద్ర, రామకృష్ణ, కృష్ణసాయి, మాధవ.
సీనియర్ బాలికలు : హిమబిందు, రాజ్యలక్ష్మి, జయలక్ష్మి, హేమలత, మౌనిక.

రాకపోకలకు 'ఇసుక టిప్పర్' బ్రేక్!



రాజంపేట-రాయచోటి ఘాట్‌రోడ్‌లోని మలుపులో నిలిచిపోయిన ఇసుక టిప్పర్

రాజంపేట : జిల్లా కేంద్రమైన రాయచోటి-రాజంపేట ఘాట్‌రోడ్‌లో సోమవారం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి బాలరాచపల్లె వద్ద ఇసుకను తరలిస్తున్న టిప్పర్ ఘాట్‌రోడ్ తీవ్ర మలుపులో ఆగిపోయింది. దీంతో రాత్రి నుంచి వాహనాలు తిరగలేదు. బస్సులతోపాటు పలు ప్రైవేటు వాహనాలు ఘాట్ వెంబడి నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. రాజంపేట-రాయచోటి ఘాట్‌రోడ్డులో వాహనాలు రాకపోకలు నిలిచిపోవడంతో కడపకు వెళ్లి, అక్కడి నుంచి జిల్లాకేంద్రమైన రాయచోటికి తరలివెళ్లారు. నిత్యం వివిధ ప్రభుత్వ ఉద్యోగులు, అత్యవసర పనుల మీదు వెళ్లే వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రాయచోటి, రాజంపేట డిపో బస్సులు ఘాట్‌లో ఎక్కడకక్కడే నిలిచిపోయాయి. ఇసుక టిప్పర్‌ను కదిలించే సన్నహాలు చేశారు. ఫలితంగా ఉదయం 10 గంటలకు ట్రాఫిక్ క్లియర్ అయింది. ఈ విషయాన్ని రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజరు రమణయ్య ధ్రువీకరించారు.

కేసు భయంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : తనపై కేసు పెడతారన్న భయంతో ఓ వ్యక్తి అదే పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న విద్యుత్ పోల్ ఎక్కి ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో తాలూకా పోలీస్‌స్టేషన్ ఎదుట జరిగింది. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ చిలకవారిపల్లెకు చెందిన గోపయ్య కొడుకు ఏసు(32) స్థానికంగా టైలర్‌గా పనిచేస్తూ చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. అతనిభార్య రేఖ గ్రామవలంటీర్‌గా పనిచేస్తోంది.గొడసానివారిపల్లె నుంచి ఏడాది క్రితం చిలకవారిపల్లెకు వచ్చి నివాసం ఉంటున్న మరోమహిళతో ఏసుకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈక్రమంలో సోమవారం మహిళ కుటుంబీకులు ఏసుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసేందుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఏసు కేసు పెడితే తనను కొడతారన్న భయంతో విద్యుత్ ట్రా న్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను ఆపివేశారు. దీంతో ఏసు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

రైలు ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : ఒడిశా రైలు ప్రమాద ఘటన చాలా బాధాకరమని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. మృతి చెందిన కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని సోమవారం సాయంత్రం ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో కడప ప్రభుత్వ బాలుర వసతిగృహం విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చెన్న కేశవరెడ్డి, హరి, కిషోర్ కుమార్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అధికారులను బెదిరించడం వరదకు అలవాటే

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : అధికారులను బెదిరించుకుని పని చేసుకోవడం ఆది నుంచి మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి అలవాటేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. రేషన్ బియ్యం దందా జరుగుతోందని వరద చేసిన విమర్శలపై సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వరద ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచే మిగతా ప్రాంతాల్లో లాగే ఇక్కడ కూడా బియ్యం వ్యాపారం జరుగుతోందన్నారు. అదేదో రాచమల్లు హయాంలోనే వ్యాపారం సాగుతోందని, అధికారులను కూడా విమర్శించారన్నారు. రేషన్ బియ్యం వ్యవస్థ మొదలు పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు బియ్యం తినని వారి సంఖ్య ఎక్కువ ఉందన్నారు. పూర్వం తక్కువగా ఉండేదని, ప్రస్తుతం ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగు పడటంతోపాటు ఈ బియ్యం తింటే కడుపు నొప్పి వస్తుందని సన్న రకం బియ్యం కొంటున్నారన్నారు. తమకు వచ్చిన బియ్యాన్ని ప్రజలు అమ్ముకుంటున్నారన్న విషయం కార్డుదారులందరికీ తెలుసునన్నారు. ఏ అధికారి ప్రజలను నివారించే పరిస్థితి లేదన్నారు. ఉద్యోగులకు, డీలర్లకు బియ్యం అక్రమ రవాణాలో ప్రమేయం లేదని తెలిపారు. ప్రజలు నేరుగా అమ్ముతుండటంతోనే ఈ వ్యవహారం కొనసాగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కిలో రూ.40 చొప్పున కొనుగోలు చేసి ప్రజలకు పంపిణీ చేస్తోందని, అదే మొత్తాన్ని నేరుగా ప్రజల ఖాతాల్లో డబ్బు జమ చేస్తే ఏ సమస్య ఉండదని, పైగా గోడౌన్లు, సరఫరా, అధికారుల విధుల బాధ్యతలు తగ్గుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తే ప్రజలు తింటారన్నారు. ఈ విషయాన్ని బయటపెట్టకుండా వరదరాజులరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు బియ్యం దందా చేస్తున్నారని ఆరోపించడం ఆయన వయసుకు తగదన్నారు. బియ్యం అమ్ముకుని బతకాల్సిన పరిస్థితి తమకు లేదని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా తహసీల్దార్ నజీర్ అహ్మద్‌పై వరద విమర్శలు చేశారన్నారు. బియ్యం దందాలో తనకు, తన బావమరిదికి ప్రమేయం ఉందని విమర్శించడం పెద్దాయన వయసుకు తగదన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే విమర్శలు చేస్తున్నారన్నారు. గతంలో రేషన్ బియ్యంలో 25 శాతం నూక ఉండేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 15 శాతం తగ్గించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని 166 రేషన్ షాపుల్లో పాతికేళ్లుగా మీ అనుచరులే డీలర్లుగా ఉన్నారని, ప్రస్తుతం కొద్దో గొప్పో తమ పార్టీ వారు ఉన్నారన్నారు. ప్రెస్‌మీట్‌లో మీ పక్కన కూర్చున్న ఎర్రన్న డీలర్ కాదా అన్నారు. తప్పు చేసినప్పుడు తనను మీరు విమర్శించినా పట్టించుకోనని, ఉద్దేశ పూర్వకంగా విమర్శలు చేసి గౌరవం పోగొట్టుకోకూడదన్నారు.

తొలి తెలుగు శాసనాన్ని కలమల్లలోనే భద్రపరచాలి



కలమల్లలో ఉన్న తొలి తెలుగు శాసనం

ఎర్రగుంట్ల : జిల్లాలోనే తొలి తెలుగు శాసనం వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండల పరిధిలోని కలమల్ల గ్రామంలో ఉన్న శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో ఉంది. కలమల్ల గ్రామంలోనే మినీ మ్యూజియం ఏర్పాటు చేసి దీనిని భద్రపరచాలని గ్రామ ప్రజలు కోరారు. క్రీ.శ. 575లో రేనాటి చోళరాజు ధనుంజయ శర్మ వేయించిన తొలి తెలుగు శాసనం ఉండటం వల్ల గ్రామానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. దీనిని 1904లో మద్రాసు శాసన పరిశోధన విభాగంగా వారు గుర్తించారని చెప్పారు. ఆచార్య నీలకంఠశాస్త్రి, ఎం వెంకటరామయ్యలు 1947-48లో దీనిని పరిశీలించి ప్రచురణలోకి తెచ్చారని చెప్పారు. ప్రాచీన లిపి ఆధారంగా ప్రప్రథమ తెలుగు శాసనంగా భారతీయ పురావస్తు శాఖ అంగీకరించిందన్నారు. ఇంతటి గొప్ప చరిత్ర కల్గిన శాసనాన్ని అందరూ తిలకించే విధంగా ఏర్పట్లు చేయాలన్నారు. గ్రామంలోని దేవాలయాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్ది శాసనం భద్రతకు మినీ మ్యూజియం ఏర్పాటు చేసి భద్రపరచాలని ప్రజలు కోరారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు



గాయపడిన బాలమ్మ

మదనపల్లె : పిచ్చికుక్క దాడిలో ఐదుగురు గాయపడిన సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. బసినికొండ పుంగనూరు రోడ్డులో నివాసం ఉంటున్న పలువురిపై పిచ్చికుక్క దాడిచేసి కరిచింది. ఈ దాడిలో బాలమ్మ(65) చేతి వేలిని కుక్క పూర్తిగా కొరికివేసింది. ఆమెతో పాటుగా జ్యోత్స్న, సునీత, అల్లాబక్షును కుక్క కరవడంతో వాళ్లు గాయాల పాలయ్యారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు పొందారు. ఈ సందర్భంగా బాధితురాలు బాలమ్మ మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో కుక్కల బెడద అధికంగా ఉందని పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయింది.

గ్యాస్ లీకై అగ్నిప్రమాదం: మహిళ మృతి



గంగులమ్మ (ఫైల్)

కడప అర్బన్: కడప హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంట్లో సోమవారం గ్యాస్ లీకై అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో గంగులమ్మ (48) మంటల్లో ఆహుతైంది. వివరాలు. గంగులమ్మ, ఆమె కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంట్లో రెండో అంతస్తులో నివాసం ఉంటున్నారు. ఉదయం 9 గంటల సమయంలో గంగులమ్మ ఇంటిలో ఉండగా గ్యాస్ లీకై మంటలు చేలరేగాయి.ఆమె తీవ్రంగా గాయపడింది.స్థానికుల సమాచారంతో కడప అగ్నిమాపక కేంద్ర అధికారి, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి ఆదేశాల మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. మంటలను ఆర్పివేశారు.గంగులమ్మను అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు.అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఆ సమయంలో పవన్‌కుమార్ రెడ్డి బయటకు వెళ్లారు. సంఘటన గురించి తెలియగానే రిమ్స్‌కు వెళ్లారు. గంగులమ్మ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప వన్‌టౌన్ ఎస్‌ఐ రంగస్వామి తెలియజేశారు. ఈ సంఘటనపై సమగ్రంగా విచారిస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.